# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 30, సెప్టెంబర్ 2025


## అంగరంగ వైభవంగా

# బతుకమ్మ సంబరాలు

**పువ్వులను పూజించడం తెలంగాణ ప్రజల సంస్కృతి: జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

పువ్వులను పూజించడం తెలంగాణ ప్రజల సంస్కృతని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లోజిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూతెలంగాణ సంస్కృుతికి అద్దంపడేలా బతుకమ్మ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందటం గొప్ప విషయమన్నారు. మహిళలు బతుకమ్మలను పేర్చి ఆడుతూ, ఐక్యత, ప్రేమను కలిగింటారున్నారు.అనంతరం జిల్లా ప్రజలకు బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, మహిళా ఎస్సైలు, మహిళా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కంపెనీలో

# రాజకీయ జోక్యం విడనాడాలి



- దసరా పండుగ సెలవు దినాన్ని అక్టోబర్ 3 కు మార్చాలి
- ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యాక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి

కాసిపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



మందమరి ఏరియాలోని కాసిపేట2 గని పై సోమవారం రోజున సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యాక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి కార్మికుల ఉద్దేశించి ప్రసంగిస్తూ యాజమాన్యం ప్రకటించిన లాభాల వాటా కార్మికుల అకౌంట్లలో జమ చేయాలని, నూతన బొగ్గ బావులు ఏర్పాటు చేయాలని, సీ అండ్ ఎండి, డైరెక్టర్ల స్థాయి సమావేశంలో ఒప్పుకున్న సమస్యలన్నిటిపై యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం వల్ల, కార్మికులు కష్టపడి తీసుకొచ్చిన లాభాల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనులకు సింగరేణి సంస్థ డబ్బులను వాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన సుమారు 43 వేల కోట్ల బకాయిలను ఇవ్వకుండా కార్మికులను మోసం చేస్తున్నారని వారన్నారు. అట్లాగే తెలంగాణలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే దసరా మిగతా 2లో..



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి మిగతా 2లో..

## భూమి అగ్రిమెంట్ నకిలీ పత్రాలు సృష్టించి

# ఘరానా మోసం

- 45 లక్షలతో ఉడాయించిన కేటుగాళ్లు
- బట్వాన్‌పల్లి గ్రామంలో కేటుగాళ్ళ ఇంటి ఎదుట బైఠాయించిన బాధితులు
- పోలీసులు ఇబ్బంది పెడితే పెట్రోల్ పోసుకొని చస్తామని స్పష్టీకరణ

2లో..

- బెల్లంపల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త





# ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

నస్పూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వచ్చినందున నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు, బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, రక్షణ ఏర్పాట్లు ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని మిగతా 2లో..

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

*(మొదటిపేజీ తరువాయి)*

శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని 17వ వార్డు అశోక్ రోడ్‌కు చెందిన పాదం శ్రీలత, పూదరి శ్రీనివాస్ భార్యాభర్తల తాము ఇద్దరము దివ్యాంగులమని, గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ప్లాస్టరింగ్ దశలో ఉందని, మున్సిపల్ జాబితాలో ఎల్ 1లో ఉన్నామని, తమ పరిస్థితిని పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు వర్తింప చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం మల్కేపల్లి గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్ 1993 వరకు తమ గ్రామం ఎస్.సి. రిజర్వుడ్ సర్పంచ్‌గా పరిగణించబడిందని, 2001లో కొందరి నిర్లక్ష్యం కారణంగా ఎస్.టి. రిజర్వుడ్‌గా మార్చబడిందని, ప్రస్తుత ఎన్నికల నిర్వహణలో రిజర్వేషన్ మార్చగలరని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన హరికిషన్ పాండే పట్టణంలోని యువ సంఘటన పాఠశాల సమీపంలో గల వాటర్ ట్యాంక్ శిథిలావస్థలో ఉందని, ఎలాంటి ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రానికి చెందిన కె.శ్రీనివాస్ తాను కొనుగోలు చేసిన భూమిలోనికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న వ్యక్తి అక్రమంగా చొరబడి నిర్మాణం చేపడుతున్నాడని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

*(మొదటిపేజీ తరువాయి)*

తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రచార అంశాలను వెంటనే తొలగించాలని, మీడియాలో వచ్చే ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జెడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి. ఎన్నికలు ప్రతి జిల్లాలో రెండు విడతలలో నిర్వహించడం జరుగుతుందని, సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు ఎంపిక చేయబడిన జిల్లాలలో మూడు విడతలుగా, మిగతా జిల్లాలలో రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నోటీసు జారీ, ఓటర్ల జాబితా ప్రదర్శన, నామినేషన్ల దాఖలు, పరిశీలన, చెల్లుబాటయ్యే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, అప్పీలు, అప్పీళ్ల పరిష్కరణ, అభ్యర్థిత్వం ఉపసంహరణ, పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, పోలింగ్ నిర్వహణ, రీపోల్ ఉన్నట్లయితే సంబంధిత ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు, ప్రకటన ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలని తెలిపారు.

రాష్ట్ర అదనపు డి.జి.పి. మహేష్ భగవత్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు తావు లేకుండా బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత, సి.సి. టివి పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన విడుదలైనందున రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూమి అగ్రిమెంట్ నకిలీ పత్రాలు సృష్టించి ఘరానా మోసం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

నకిలీ భూమి పత్రాలు సృష్టించి భూమి అమ్ముతామని నమ్మబలికి భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా తమ వద్ద రూ 45 లక్షలు టోకరా వేశారని పేర్కొంటూ భాధితులు సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామంలో రామటెంకి హరికృష్ణ, రామటెంకి శివ ఇంటి ఎదుట పంది మాంసంతో వినూత్న రీతిలో ధర్నా చేపట్టారు. తమను నమ్మించి మోసం చేసిన వారినుంచి తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు నినాదాలు చేశారు.ఈ విషయం లో తమను పోలిసులు ఇబ్బందులు పెడితే పెట్రోల్ పోసుకొని సామూహికంగా ఆత్మహత్యకు పాల్పాడుతామని హేచ్చరించడం కలకలం రేపింది. బాధితులు ఎరుకల సామాజిక వర్గానికి చెందిన పెద్దపల్లి జిల్లా మంథని సమీపంలో గల దుబ్బపల్లికి చెందిన బాలాని గంగరాజు, పూజారి సమ్మయ్య, పూజారి నాగేష్, దాసరి శ్యామ్, గోపి, పోల రాములు లు విలేకరులతో తమ గోడు వెళ్ళబుచ్చారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తాండూర్ మండలంలోని అచ్చులాపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 340/1, 341/బిలో 12 ఎకరాలు వ్యవసాయ భూమిని రాంటెంకి శివ, రాంటెంకి హరికృష్ణతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు పాత మంచిర్యాలకు చెందిన బొలిశెట్టి భీమయ్యతో భూమితో కలిసి విక్రయ ఒప్పందం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తాతారావు, శ్రీనివాస రావులు పట్టాదారులు అని నకిలీ వ్యక్తిని చూపించి తమను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. డబ్బులు ఇచ్చేవరకు తాము ఆందోళన విరమించభోమని వారు స్పష్టం చేశారు. చేసేది ఏమి లేక పోలీసులు మిన్నకుండీ పోయారు.

# సింగరేణి కంపెనీలో రాజకీయ జోక్యం విడనాడాలి

*(మొదటిపేజీ తరువాయి)*

పండుగ జాతిపిత మహాత్ముడైన గాంధీ జయంతి అక్టోబర్ రెండున రావడం దసరా పండుగను అత్యంత వైభవంగా సింగరేణి ఉద్యోగులు జరుపుకొనుటకు ఇబ్బందిగా మారిందని పండుగ రోజున గనుల పైన మేకలతో మైసమ్మ పూజలు చేస్తూ సంవత్సర కాలమంతా నిర్దేశిత లక్ష్య సాధనలో మాకు ఎటువంటి ప్రమాదములు జరగరాదని భావోద్వేగంతో, భక్తి పారవశ్యంతో అమ్మవారిని కోరుకుంటారు. ఆ సందర్భంగా అమ్మవారి మొక్కు తీర్చునప్పుడు మద్యం ప్రధాన భూమిక పోషిస్తుందని పూజకు సంబంధించిన అవసరమైన ప్రధాన వనరులు, అక్టోబరు రెండో తారీకున మహాత్మాగాంధీ జయంతి కారణంగా నిషేధించబడినవి. అందువల్ల ఉద్యోగుల కోరికను మన్నించి యాజమాన్యం సహృదయంతో ఆలోచించి కార్మికుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని అక్టోబర్ తారీఖున వచ్చిన దసరా పండుగను అక్టోబర్ 3 వ తేదిన మార్చాలని కోరుతున్నామన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఇదివరకే ఉద్యోగుల మనోభావాలను, భక్తి పారవశ్యాలను దృష్టిలో పెట్టుకొని మీకు లిచత పూర్వకంగా తెలియజేయడం జరిగిందని, దసరా సమీపిస్తున్న వేళ మరొకసారి ఉద్యోగుల మనోభావాలను దసరా పై ఉద్యోగులకు ఉన్న మక్కువను మీ దృష్టికి మరొకసారి వినతి పత్రాల ద్వారా అన్ని గనులు డిపార్ట్మెంట్ల ఉద్యోగుల ద్వారా పంపిస్తున్నామని యాజమాన్యం ఉద్యోగులకు ఇచ్చిన నిర్దేశిత లక్ష్యాలను గత దశాబ్దాల కాలము నుండి ఏనాడు ఏమరపాటు కూడా నిరక్ష్యంల్లో చేయకుండా సాధిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా నిర్దేశిత లక్ష్యాలను సాధించుటకు ఉద్యోగులందరూ కంఠణ బద్ధులై ఉన్నారు. ఇప్పటికే కోల్ ఇండియాలో వివిధ రాష్ట్రాలలో ఉన్న బొగ్గు సంస్థలు దసరా తేదీని మార్చుతూ నిర్ణయం తీసుకున్నాయి.కాబట్టి సింగరేణి లో కూడా దసరా పండుగను అక్టోబర్ 3 తారీకుకు మార్చాలని వారన్నారు. అలాగే పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ఐదవ షెడ్యూల్ లోని అన్ పేరు లేబర్ ప్రాక్టీస్‌ను సింగరేణి సంస్థలో కొనసాగిస్తూ సబ్ సెక్షన్ 1 నుండి 12 వరకు గుర్తింపు కార్మిక సంఘంపై జరిగిన ఒప్పందాలపై అనుచిత పద్ధతులు కొనసాగిస్తూ యజమాన్యం సింగరేణి కంపెనీలో 135 సంవత్సరాలలో లేని రాజకీయ జోక్యాన్ని ప్రదర్శిస్తూ కార్మిక చట్టాలను కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలుపరచకుండా అన్ఫేర్ లేబర్ ప్రాక్టీస్ కొనసాగిస్తున్నారు. కావున చిత్తశుద్ధితో కార్మిక చట్టాలను అమలు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని హెచ్చరించారు అనంతరం సంబంధిత గని మేనేజర్ బి. లక్ష్మీనారాయణకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొంకూర్ రామచందర్ ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, పిట్ కమిటీ ఉపాధ్యక్షులు కొండపల్లి నరసయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ బొద్దుల వెంకటేష్, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్లు కృష్ణ చారి, రాజ్ కుమార్, ప్రదీప్ కుమార్, కమిటీ సభ్యులు జావిద్, లింగమూర్తి, రాజకుమారయ్య, సాగర్, రవి కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

బోథ్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



మండలంలోని డెమ్మి గ్రామానికి చెందిన సంబ్లె ఈశ్వర్ సింగ్ (28) అనే యువకుడు గంజాయి సాగు చేసి తరలిస్తుండగా సోమవారం పోలీసులకు పట్టుబడ్డాడు. 500 గ్రాముల గంజాయి, సుమారు 12000 వేల విలువ చేస్తుందని తెలిపారు. గంజాయి తరలిస్తున్న మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై శ్రీ సాయి తెలిపారు. ఎవరైనా గంజాయి పండించిన తరలించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా జాసిన్త్ జోల్ బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా జాసిన్త్ జోల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## పేదల గోడును వినేది కాంగ్రెస్ : కూచాడి

దిలావర్పూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని డిసిసి అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. సోమవారం దిలావర్ పూర్ మండలం లోలం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు పరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం నుండి అందించే ఐదు లక్షల రూపాయలను విడుదలవారీగా అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఎలాంటి ఇండ్లను నిర్మించలేదని కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమే ఇలాంటి పనులు చేపడుతుందని తెలిపారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ డిమారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, కాలువ లక్షి ్మ ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్, కదిలీ ఆలయ చైర్మన్ వెంకట్రావు, అరుగుల రమణ, మహేష్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

వేమనపల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

వేమనపల్లిలో రాజకీయ పరిణామాలు కొత్త మలుపు తిరిగాయి గత కొన్నాళ్లుగా వేమనపల్లి గ్రామంలో బలమైన స్థావరం ఏర్పరచుకున్న బిఆర్ఎస్ క్రమంగా బలహీనమ వుతుండగా సోమవారం రోజు కాంగ్రెస్ పార్టీ వైపు పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. సుమారుగా 400మంది బిఆర్ఎస్ కార్యకర్తలు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ జెడ్పిటిసి ఆర్.సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారు ఉప్పలపు సాయి, ఉప్పలపు శ్రీనివాస్, తిరుమలేష్, దేవునూరి సతీష్, గొండె రవి, ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, ఆకుల లింగాగౌడ్, కుర్రు వెంకటేశం, ఒడిల రాజన్న, జాహిద్ అలీ, గాలి మధు, తోకల రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఆలయాన్ని దర్శించిన ఎమ్మెల్యే

బోథ్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

జ్ఞాన సరస్వతి బాసర ఆలయాన్ని దేవి నవరాత్రుల సందర్భంగా సోమవారం బోథ్ శాసనసభ్యుడు అనిల్ జాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకోవడం జరిగిందని తెలిపారు. గతంలో కెసిఆర్ బాసర ఆలయ అభివృద్ధికి 50 కోట్లు మంజూరు చేశారని, ఇప్పుడున్న ప్రభుత్వం 10 కోట్లు మాత్రమే వినియోగించి 40 కోట్లను రద్దు చేయడం సరైన పద్ధతి కాదని, ఆ 40 కోట్లను సైతం ఆలయ అభివృద్ధికి వినియోగించాలని ఎమ్మెల్యే ప్రకటనలో పేర్కొన్నారు. వీరితో బాసర మండల కన్వీనర్ శ్యామ్, బింద్రెల్లి మాజీ సర్పంచు డిగంబర్ తదితరులు ఉన్నారు.



# ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ, జెడ్పిటీసి, ఎంపిటీసి ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందించిన శిక్షణ కార్యక్రమానికి కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని తెలిపారు. అధికారులకు ఇచ్చిన హ్యాండ్ బుక్ ను క్షుణ్ణంగా చదివి ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నాసిరకం మందులు అమ్మితే చర్యలు తప్పవు

**- మండల వ్యవసాయాధికారి రామకృష్ణ**

దహెగాం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు నాసిరకం ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి జి.రామకృష్ణ అన్నారు. సోమవారం దహెగాం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పత్తి పంట పూత, కాత దశలో ఉన్నందున రైతులకు నాసిరకం మందులు అంటకడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు సాగు విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయశాఖ వారిని సంప్రదించాలని అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో తెల్లదోమ,పచ్చదోమ, తామర పురుగు నివారణ కొరకు, వరి పంట పొట్టదశలో తెల్లకంకి అవకుండా ఎండు తెగులు, అగ్గితెగులు రాకుండా వ్యవసాయ అధికారులు సూచించిన మందులను వాడినట్లయితే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఇప్పటి వరకు ఫార్మ రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు సంబంధిత ఏఈఓల వద్ద పంట నమోదు చేసుకోవాలని అన్నారు. అనంతరం సొసైటి దగ్గర యూరియా పంపిణికి పరిశీలించి రైతులందరికి ఎరువులు అందేలా చర్యలు తీసుకున్నారు.

## హిందుత్వ జీవన విధానం విశ్వశాంతికి ఆధారం

**- హిందువుల సంఘటితనే ఆర్ఎస్ఎస్ లక్ష్యం**

కెరమెరి ,సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

హిందుత్వ జీవన విధానం విశ్వశాంతికి ఆధారమని హిందువుల సంఘటిత ఐక్యత ఆర్ఎస్ఎస్ లక్ష్యం అని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శివాలయంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భారతీయులందరూ పంచవర్ధన్ విషయాలపై కుటుంబ ప్రబోధ సామాజిక సమరసత స్వదేశీ పర్యావరణం పౌర విధులు అమలు చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. హిందువులలో ఐక్యతను శాఖ ద్వారా సంఘము పెంపొందిస్తుందన్నారు. ప్రపంచంలోనే వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు రామకృష్ణ, పల్లెర్ల ధనరాజు, శ్రీనివాస్ కంద, కోటేశ్వరరావు, శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రామ్ లీలా మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

**- హిందూ ఉత్సవ సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్ కిరణ్**

నస్పూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

విజయదశమి పర్వ దినాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 2న నస్పూర్ పట్టణంలోని ప్రాణహిత మైదానంలో సింగరేణి సంస్థ సహకారంతో రామ్ లీలా మహోత్సవ (సప్త వ్యసన దహనం) కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు హిందూ ఉత్సవ సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్ కిరణ్ తెలిపారు. సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రామ్ లీలా మహోత్సవంలో మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగ విజయ దశమి అని, పురాణాల ప్రకారం శ్రీరాముడి చేతిలో రావణుడి ఓటమి విజయదశమి నాడే జరిగిందని పేర్కొన్నారు. జూదం, మద్యం సేవించడం, వేట, డబ్బు దుబారా చేయడం, స్త్రీ లోలుపత, మాంసాహారం, దొంగతనం లేదా కఠినంగా మాట్లాడటం వంటి ఏడు చెడు వ్యసనాలను మనిషి వాటిని పూర్తిగా త్యజించి, వాటి ప్రభావం నుంచి బయటపడి మంచి మార్గంలో నడవటమే సప్త వ్యసన దహనం అన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి నస్పూర్ అధ్యక్షుడు ఎర్ర తిరుపతి, ఉపాధ్యక్షురాలు దివ్య, ఉపాధ్యక్షుడు తోట వెంకటేష్, నాయకులు కట్కూరి తిరుపతి, బొలిశెట్టి మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్ 2లో మెరిసిన బజార్‌హత్నూర్ వాసి

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని బిట్లింగు లక్ష్మిఖ్యుమ్మన్, సరస్వతి కుమారుడైన బిట్లింగు ఉదయ్ కుమార్ గ్రూప్ 2 పరీక్షలో ప్రతిభ కనబరిచాడు. పోటీ పరీక్ష ఏదయినా కొలువు సాధించడమే లక్ష్యంగా మార్చుకున్నాడు. బిట్లింగ్ ఉదయ్ కుమార్ ఒకటి కాదు రెండు కాదు ఏకంగా తొమ్మిది ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. తాజాగా గ్రూప్ 2లో వెలువడిన ఫలితాలలో డిప్యూటీ తహసీల్దార్ కొలువు సాధించాడు. ఈయన ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్ నగర్లో నివాసం ఉంటున్నాడు. తండ్రి రేషన్ డీలర్ కాగా, తల్లి గృహిణి. 2019లో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అలాగే 2022లో పోస్టల్ అసిస్టెంట్, 2023లో సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా, పంచాయతీరాజ్లో జూనియర్ అసిస్టెంట్, గ్రూప్3లో 72వ ర్యాంక్ సాధించాడు. అలాగే ట్రెజరీలో జూనియర్ అసిస్టెంట్ అకౌంటెంట్ ఎంపికై 2024 నుంచి ఆదిలాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రస్తుతం గ్రూప్2లో 51వ ర్యాంక్ సాధించి డిప్యూటీ తహసీల్దార్ పోస్టుకు ఎంపికయ్యాడు. సివిల్స్‌కు ఎంపిక కావడమే నా చిరకాల కోరిక అని ఆయన అన్నారు.



## బీసీ రిజర్వేషన్లపై వ్యతిరేకతను ఖండిస్తున్నాం

**- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్**

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టుకు వెళ్ళడాన్ని వ్యతిరేకిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా ఎదగడానికి ప్రయత్నిస్తే ఒక సామజిక వర్గం ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. దేశానికి స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా బీసీలకు సరియైన రాజకీయ రిజర్వేషన్ లేకపోవడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో జిల్లా బీసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి బీసీ రాజకీయ జేఏసీ ఏర్పాటు చేస్తామని, బీసీ లకి రాజకీయంగా అన్యాయం జరిగితే సాహించేది లేదని పునద్ఘటించారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు బీసీల హక్కుయని, దానిని కాలరాస్తే సహించలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర గవర్నర్ బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలపలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడి మారుతి పటేల్, అచల భారత మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగోశే శంకర్, బీసీ రైతు సంఘం మండల అధ్యక్షుడు బాల్దారపు మధుకర్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు నాయకిని రాజన్న, నీకోరే హనుమంతు, శెండే నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుడు శ్రీహరి రావుని కలిసిన యాకర్‌పల్లి గ్రామ ప్రజలు

సారంగాపూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం యాకర్‌పల్లి, వంజర్ గ్రామ ప్రజలు సోమవారం జిల్లా కేంద్రంలోని డిసిసి క్యాంప్ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో విధంగా విన్నవించు కొన్నారు, యాకర్‌పల్లి నుండి వంజర్ గ్రామాన్ని కలుపుతూ స్వర్ణ వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలంలో వాగు దాటడం కష్టసాధ్యమై గ్రామ ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 400 ఎకరాలకు పైగా ఉన్న వ్యవసాయ భూములకు రాకపోకలు నిలిచిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రతిసంవత్సరం శ్రీ మహా పోచమ్మ దేవాలయ గంగనీల్ల జాతరలో భాగంగా అమ్మవారి ఆభరణాలను శుద్ధి చేయడానికి సంఘ్వి గ్రామానికి తీసుకెళ్లడం కోసం వాగు దాటాల్సి వస్తుందని, వంతెన ఉంటే ఈ ఇబ్బందులు తొలగిపోతాయని, మండల కేంద్రానికి దగ్గర అవుతుంది అని తెలిపారు. డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు సానుకూలంగా స్పందించి జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని, వీలైనంత త్వరగా బ్రిడ్జ్ నిర్మించి గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, సారంగాపూర్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ రాజేశ్వర్, నాయకులు సత్యపాల్ రెడ్డి, జంగిటి సందీప్, రాజేశ్వర్ రెడ్డి, మధాస్తు రాజేశ్వర్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# చెక్‌పోస్ట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలి

**- జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



అక్టోబర్‌లో ప్రారంభమయ్యే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా పోలీస్ అధికారులు చెక్ పోస్ట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీకాంతిలాల్ పాటిల్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెలవారి నేర సమీక్షలో ఎస్పీ పాల్గొని పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది సంసిద్ధంగా ఉంటూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు ప్రారంభమైన నేపథ్యంలో అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని, 24 గంటలు అప్రమత్తతతో విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికలలో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు,మద్యం ఇతర సామాగ్రి జిల్లాలోనికి ప్రవేశించకుండా చెక్ పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి సిసి కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామాలలో పట్టణాలలో, ఆయా గ్రామాల విపిఓలు పోలీస్ అధికారులు సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించి ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని అన్నారు . జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలని మట్కా, గంజాయి,పేకాట లాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచేది లేదని తెలిపారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ ఎఎస్పి చిత్తరంజన్, కాగజ్‌నగర్ డిఎస్పి వాహిదుద్దీన్, డిసిఆర్బి ఎస్పి విష్ణుమూర్తి, స్పెషల్ బ్రాంచ్, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్, డిసిఆర్బి సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా పంపిణీలో అక్రమాలు





వేమనపల్లి,సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

వేమనపల్లి మండలం నీల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన యూరియా పంపిణీలో అవకతవకలు చోటుచేసుకున్నాయి.వివరాలకు వెళ్తే మండలంలోని రైతులకు యూరియా పంపిణీ కోసం 266 బస్తాల లారీ ఆదివారం వచ్చింది. సోమవారం ఉదయం యూరియా పంపిణీ చేయడానికి మండల వ్యవసాయ అధికారి వీరన్న వచ్చారు. అర్ధరాత్రి నుంచి రైతులు క్యూ లైన్ లో ఉన్నారు.పిఏసిఎస్ గోదాం నిల్వలు పరిశీలించి ఏవో గోదాంలో ఉన్న 250 టోకెన్లు పంపిణీ చేశారు. అర్ధరాత్రి నుంచి క్యూలైన్ లో వేచి ఉన్న సగానికిపైగా రైతులకు టోకెన్లు అందక నిరాశతో వెనుతిరిగారు .రైతులు 266 బస్తాలకు టోకెన్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 250 టోకెన్లు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. గోదాంలో 250 బస్తాలు మాత్రమే ఉన్నాయని వాటికే టోకెన్లు పంపిణీ చేశానని మిగతా బస్తాలు ఏమయ్యాయో తెలియదని సమాధానం చెప్పారు.దీనిపై సహకార సంఘం సీఈఓ మచ్చ మధుకర్ ను వివరణ అడగగా గతంలో జారీ చేసిన టోకెన్లకు యూరియా పంపిణీ చేశామని పొంతన లేని సమాధానాలు చెప్పడంతో రైతులు అయోమయానికి గురయ్యారు.ఏవో చెప్తున్నా లెక్కలకు పిఏసిఎస్ సీఈవో చెప్తున్న లెక్కలకు 16 బస్తాలు వ్యత్యాసం ఉంది అర్ధరాత్రి ఏమైనా బస్తాలు అక్రమంగా తరలించారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## యూరియా అక్రమ రవాణాపై ఏవోకు ఫిర్యాదు..

ఆదివారం నీల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి రైతుల పంపిణీ చేయడానికి వచ్చిన యూరియా పక్కదారి పట్టిందని బిజెపి మండల అధ్యక్షులు ఏట మధుకర్ ఆరోపించారు.రైతులు ఒక్క బస్తా కోసం అర్ధరాత్రి నుంచి క్యూ లైన్లో నిలబడి ఎండకు తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోతున్నారాని యూరియా బస్తాల లారీ లోడును మార్గ మధ్యలో ఆపి అక్రమంగా తరలించారని ఆరోపించారు.రైతులకు అందాల్సి న యూరియాను దళారులకు అక్రమంగా ఇవ్వడం ఎంత వరకు సమంజసం, ఇప్పటికైన యూరియా పంపిణీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి శాఖ పరిమైన చర్యలు తీసుకోవాలని ఏవోకు పిర్యాదు చేశారు.

# సింగరేణిలో అక్టోబర్ 3న దసరా సెలవు ఇవ్వాలి

**- ఏఐటీయూసీ నాయకులు**

నస్పూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

సింగరేణిలో అక్టోబర్ 3న దసరా సెలవు ఇవ్వాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ (ఏఐటీయూసీ) యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య , ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదాలు మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున తెలంగాణలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే దసరా పండుగ రావడంతో దసరా పండుగను సింగరేణి ఉద్యోగులు వైభవంగా నిర్వహించుకోవడానికి వీలు లేకుండా పోయిందని, మైసమ్మ తల్లి దీవెనలు తమ పై ఉండాలని, విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు జరగకూడదని కోరుతూ సింగరేణి కార్మికులు దసరా రోజున ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే కోల్ ఇండియాలో బొగ్గు సంస్థలు దసరా తేదీని మార్చుటకు నిర్ణయం తీసుకున్నాయని, సింగరేణి కార్మికుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్ 3న దసరా సెలవు ప్రకటించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధులు రాచర్ల చంద్రమోహన్, ప్రసాద్ రెడ్డి, సంపత్, బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, మురళి చౌదరి, గునిగంటి నర్సింగ రావు, మారుపెల్లి సారయ్య, నవీన్ రెడ్డి, మోతే లచ్చన్న, కుమారస్వామి, ఆడెపు మల్లికార్జున్, ఎడ్ల సమ్మయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## వేమనపల్లి తహసీల్దార్‌గా బి.సాయి బాబు

వేమనపల్లి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త



వేమనపల్లి తహసీల్దార్‌గా బి.సాయి బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన పుష్పలత కలెక్టరేట్‌కి బదిలీ కాగా ఆమె స్థానంలో సాయిబాబు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూభారతి, ఇతర సర్టిఫికెట్లు, వివిధ అవసరాల కోసం వచ్చేవారు నేరుగా తనను కలవొచ్చని చెప్పారు. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బంది తహసీల్దార్ కి స్వాగతం పలికారు.

## ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ తప్పనిసరి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిగా పని చేస్తున్న సజీవన్ పదవీ విరమణ పొందిన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమానికి జిల్లా ఎస్పి కాంతిలాల్ సుభాష్, అధికారులతో కలిసి హాజరై సజీవన్ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగి పాత్ర కీలకమైనదని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ తప్పనిసరి అని, పదవి విరమణ పొందిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమైనది

**- జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ**

మందమర్రి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన గుర్తింపు సంఘం (ఏ.ఐ.టి.యు.సి) యూనియన్ తో 10వ స్ట్రక్చర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి కార్మికుల పలు సమస్యలపై జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు సోమవారం రోజున గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి) మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏఐటియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, మరియు ఏ.ఐ.టి.యు.సి నాయకులతో నిర్మాణాత్మక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిఎం రాధాకృష్ణ గుర్తింపు సంఘం నాయకులతో మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి ఉత్పాదకత లో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమైనది అని సింగరేణి సంస్థ ఉత్పత్తి మరియు ఉత్పాదకత లోనే కాకుండా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఎక్కువ ప్రదాన్యతను ఇస్తుంది అని తెలిపారు. ఈ సందర్భంగా గడిచిన సమావేశంలో జరిగిన పనుల యొక్క పురోగతి గురించి చర్చించారు. గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఏవిధముగా ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించారో ఇక ముందు కూడా సహకరిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, కే.కే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, కేకే ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఐఈడి ఎస్.ఇ కిరణ్ కుమార్, ఏరియా స్టోర్స్ డీ.జీ.ఎం ఈ అండ్ ఎం సురేష్, సివిల్ ఎస్.ఇ రాము,డి.వై.పి.ఎం సందీప్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఏఐటీయూసీ మందమర్రి వైస్ ప్రెసిడెంట్ సుదర్శనం, ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి రమణ, సీనియర్ అధికారులు, ఏఐటియుసి యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై సమరం షురూ..!

**ఎన్నికల సిబ్బందికి శిక్షణ ప్రారంభం - 6 ఎంపీటీసీ, 1 జడ్పీటిసి, 108 వార్డులు, 12 సర్పంచ్ స్థానాలు - కొత్త వారికే ఈసారి అవకాశమా..?**



దిలావర్పూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎన్నికల పనులు ప్రారంభమయ్యాయి. దీంతో మొదటగా దిలావర్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రీసైడింగ్, సహాయక ప్రీసైడింగ్ అధికారులకు ఎంపీడీవో అరుణ రాణి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 6 ఎంపీటీసీ స్థానాలు 1 జడ్పీటిసి స్థానం ఉంటుంది. వీటికి గాను 34 పోలింగ్ బూతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. జడ్పీటిసి (జనరల్ మహిళ), ఎంపీపీ (జనరల్) కాగా 108 వార్డులు, బన్సపల్లి, కంజర్, లోలం గ్రామాలలో బీసీ జనరల్, దిలావర్పూర్, మాడేగాం గ్రామాలకు జనరల్, కాల్వ తండా, సాంగ్వి గ్రామాలకు ఎస్టి జనరల్, కాల్వ ఎస్సి (మహిళ), సిర్గాపూర్, గుండంపల్లి, బీసీ (మహిళ), సముందర్ పల్లి ఎస్సీ జనరల్, మాయాపూర్ జనరల్ మహిళ సర్పంచ్ స్థానాలకు అవకాశం కల్పించింది. ఎంపీటీసీ, జెడ్పీటిసి లకు అక్టోబర్ 9న నామినేషన్లు 23న పోలింగ్, అక్టోబర్ 17, 31న పోలింగ్ ఫలితాలు వెలువడునున్నాయి. ఇవన్నీ రెండు విడతలవారీగా ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటి కోసం అన్ని పార్టీల అభ్యర్థులు పోటీ చేసేందుకు సన్నహాలు చేసుకుంటున్నారు.కొత్తవారికే అవకాశం..? అయితే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. చాలా గ్రామాలలో నెలకొన్న సమస్యలు, సామాన్యులను నాయకులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి. మండలంలోని ప్రాచీన ఆలయాలైన కదిలి, కాల్వ ఆలయాల డైరెక్టర్లుగా గతంలో పనిచేసిన వారికి ఇస్తున్నారని తమకు అవకాశం ఇవ్వలేదని, కొన్ని సామాజిక వర్గాల వారిలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఈ పార్టీలో ఉన్నవారే, గెలిచిన పార్టీలోనూ ఉంటున్నారు. అంతేకాకుండా ఆ పార్టీ తరపున టికెట్ తెచ్చుకొని మళ్ళీ వాళ్లే పోటీ చేస్తారనే అసహనం ప్రజల్లో విపరీతంగా పెరిగిపోయింది. దీంతో కొత్తవారిని గెలిపించుకొని పట్టం వాళ్లకే కట్టబెట్టాలని ఆలోచిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో పోటీలో నేను ఉంటా అనే మాటలు గ్రామాలలో వినిపిస్తున్నాయి.

# స్థానిక ఎన్నికల నిర్వహణ గురించి శిక్షణ సమావేశం

సారంగాపూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



గ్రామపంచాయతీ ఎన్నికల కొరకు నియమించబడిన ప్రిసైడింగ్ ఆఫీసర్స్‌కి (పి.ఓ) స్థానిక మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మీ శ్రీకాంతరావు ఆధ్వర్యంలో సోమవారం రైతు వేదిక నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా నియమించబడిన ఎన్నికల సిబ్బందికి జడ్పీటిసి, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి అవసరమైన విధివిధానాలను మాస్టర్ ట్రేనీలుగా వచ్చినటువంటి నకిరెడ్డి నారాయణరెడ్డి, కూన రమేష్‌లు అవగాహన కల్పించారు పోలింగ్ తేది కన్నా ఒక రోజు ముందు ఎన్నికల విధులలో చేరిన నుండి మరుసటి రోజు ఎన్నికలు నిర్వహించి, లెక్కింపు వరకు ఉండే వివిధ దశలను వివరించడం జరిగింది. స్థానిక ఎంపీడీవో లక్ష్మీ శ్రీ కాంతారావు మాట్లాడుతూ 2018 పంచాయతీ రాజ్ ఎన్నికల చట్టం ప్రకారం ప్రస్తుత ఎన్నికలు జరుగుతున్నాయి. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ మనమంతా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పనిచేయడం జరుగుతుందని గ్రామపంచాయతీ ఎన్నికలను, ప్రాదేశిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగింది. మండల విద్యాశాఖాధికారి బి మహేందర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవాలని ఎక్కడైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలపడం జరిగింది. మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించిన నకిరెడ్డి నారాయణ రెడ్డి ఎన్నికలకు ఒక రోజు ముందు మండల కేంద్రంలో తీసుకోవలసినటువంటి ఎన్నికల సామాగ్రి నుంచి విధులు నిర్వహించే పోలింగ్ స్టేషన్లో చేయవలసినటువంటి పనుల గురించి, పోలింగ్ ఏజెంట్ల నియామాకం గురించి, బ్యాలెట్ బాక్స్ సీల్ చేయడం గురించి, ఎన్నికలు నిర్వహించే సమయంలో వచ్చే ఇబ్బందులను అధిగమించడం గురించి వివరించడం జరిగింది. కూన రమేష్ గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత నింపవలసినటువంటి ప్రిసైడింగ్ ఆఫీసర్ డైరీ, డిక్లరేషన్, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సిల్ అకౌంట్, విజిట్ షీట్ మొదలైన ఫారాల గురించి, ఎన్నికల ఫలితాలను వార్డుల వారీగా లెక్కించడం గురించి, ఉప సర్పంచ్ ఎన్నిక గురించి, వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్నా ఎన్నికల సిబ్బందితోపాటు, మండల పంచాయతీ అధికారి అజీత్ ఖాన్ , మండల పరిషత్ సూపరిండెంట్ లింబాద్రి, మండల వ్యవసాయ అధికారి మండల రెవెన్యూ అధికారి తదితరులు పాల్గొని. శిక్షణ పొందిన ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు చేయడం జరిగింది.

# సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**- గుండెపోటు నివారణ అంశాలపై అవగాహన కలిగి ఉండాలి**

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

నస్పూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్.కె 8 డిస్పెన్సరీలో డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి శ్రీరాంపూర్ జీఎం ముఖ్య అతిథిగా హాజరై, హృదయ సంబంధిత వ్యాధులు, నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు గుండెపోటు నివారణ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, శరీర బరువు అదుపులో ఉంచుకోవాలని, రక్తపోటు మధుమేహం వంటి వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవాలని పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధి గ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, సంబంధిత ఆస్పత్రిలో రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలని చెప్పారు. ఈ సంవత్సర హృదయ దినోత్సవ థీమ్ డోంట్ మిస్ ఏ బీట్ అని, ఎవరైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి గురైనా, గుండె దడ ఉన్న, ఛాతిలో నొప్పి ఉన్న నిరక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లోకనాథ్ రెడ్డి, డాక్టర్ సాయి నికిత, డాక్టర్ పింకీ, డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.